ప్రయాణీకులు

★

'త్రిపుర'

శివరామన్ వెళ్ళిపోతుంటే చూడడానికి ఏర్‌పోర్టుకి వెళ్ళేను. శివరామన్‌ని కలకత్తాలో ఈరాష్ట్రం స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశాను. ఇక్కడ అతనికి 'వేడి' ఎక్కువయిపోయింది.

మూడేళ్లనుంచీ కలిసి ఉంటూ, నా చేతికింద పనిచేస్తూ, నాతో స్నేహంగా గడిపిన శివరామన్‌తో ఈ సమయంలో ఏమిటి మాట్లాడగలను ? అతని జీవనం అంతా బాహ్యంగానే ఉంటుంది. కలకత్తాలో దిగగానే మెట్రో, లైట్‌హౌస్, న్యూ ఎంపైర్‌లలో ఏది ఉంటే అది రెండు రోజుల్లో చూసేస్తాను..... రాత్రి గ్రేండ్‌లో కెబేరే .... ఫ్లోర్ పైలో యిజిప్షన్ .... కర్వ్స్ .... మెంటల్‌కాలు ఒకటి అప్పుడే చోరింఘీలో పెట్టి మాట్లాడుకు పోతున్నాడు.

అతన్ని దిగపెట్టడానికి వచ్చేనే గాని నాకు మనస్సు కుదురుగా లేదు. రాత్రంతా ఫోన్ దగ్గరే గడిపేను. నిద్ర లేదు. సాయంత్రం హఠాత్తుగా వచ్చిన మూడు బీహార్ మిలిటరీ పోలీస్ కంపెనీలకి ట్రాన్స్‌పోర్ట్ కావలసి వచ్చింది. నిలబడ్డ పాటుగా వచ్చేశారు. బూతులు తిట్టేను చూడవచ్చిన వాళ్ళ కమాండంట్‌ని. రాత్రంతా ఫోన్ దగ్గర కూర్చుని పట్నంలో ఉన్న గవర్నమెంట్, ప్రైవేట్ జీప్‌లూ, లారీలూ కమాండీర్ చేసి, వాళ్ల నందర్నీ బోర్డర్ దగ్గరికి పంపించేను. మెడికల్ కవర్ కోసం ముగ్గురు డాక్టర్లని తయారుగా ఉంచమని హాస్పిటల్ సూపరింటెండెంట్‌కి ఆర్డర్ పంపించేను. అప్పుడే ఆఖరి లారీలో అందరూ చేరేరని కబురొచ్చింది.

పైని యింకా కొంచెం చీకటిగా ఉంది. ఫోన్ దగ్గర నుంచి లేచి, షేవ్, షవర్, డ్రెస్ చేసుకుని బయటికి వచ్చేను. సుశీల గాఢంగా నిద్రపోతూంది. ఏనుగులు వచ్చి తొండాలతో యింటిని కదిపేస్తున్నా మేలుకోదు. అదృష్టవంతురాలు సుశీల. ఆధారం దొరికితే అద్భుతంగా, అందంగా పాకుతూ చాలాదూరం ప్రయాణం చేస్తుంది. లేకపోతే ......

స్టేషన్ వాగన్ పైకి తీసి, మోట్రగారోడ్‌మీద కొంత దూరం పోయి, కుంజబన్ పక్క నుంచి ఏర్‌పోర్టు రోడ్డులోకి మళ్లించేను. ప్రకృతి అంటే చెట్లు, కొండలూ, హాలీవుడ్ రంగులూ. రివ్వున చలిగాలి చెంపలమీద కొట్టుంటే, కోట్ లేపెల్స్ పైకెత్తి మెడ కప్పుకుంటే వచ్చేది దేహానికి ఒక వింతైన హాయి; అన్‌కాన్షస్ ఆనందం. ప్రకృతి కళ్లల్లో మెదుల్తూ వెనక్కి పోతుంటే, వాగన్ రోడ్‌ని తుడిచేస్తూ ముందుకు పోతూంటే వచ్చే హాయిని గురించి కాన్షస్‌గా ఆలోచిస్తూ ఉంటే, పాత జీవితంలో అక్కడక్కడ మైలురాళ్లలాగ పాతుకుపోయి స్థిరంగా ఉండిపోయిన విషపూరిత క్షణాలు ఆనందంతో నిండిపోయిన మనస్సులో ఒక్క చిలుకు చిలుకుతాయి. కలవరపడిపోతుంది మనస్సు ఆ క్షణాన్ని. దేహం గగుర్పొడుస్తుంది.

గౌహతి వెళ్ళే ఫాకర్ అప్పుడే దిగుతూంది. లౌంజ్‌లో హారిస్ ట్వీడ్ ఎడ్వర్టైజ్‌మెంట్ మోడల్ లాగ శివరామన్. ఆలివ్‌గ్రీన్ యూనిఫార్మ్స్‌లో మిలిటరీ ఆఫీసర్స్ చాలామంది కూచున్నారు. చెట్టు ఆకుల్లో ఒకే పువ్వులా నేవీబ్లూ సూట్‌లో శివరామన్. మిలిటరీ భుజాలమీద బ్రాస్‌పిప్స్ మెరుస్తున్నాయి .... డామిట్ .... బ్లడీ .... లు కౌట్.... డిప్లాయ్.... ఏర్ సుపీరియారిటీ .... చైనీస్ బగ్గర్స్ .... మిలిటరీ మాటలు వడగళ్లలాగ పడుతున్నాయి. శివరామన్‌ని పిలిచి రెస్తరంట్‌కి తీసుకువచ్చేను.

ఇక్కడ వెచ్చగా ఉంది. నియాన్ దీపాలు ఇంకా వెలిగించే ఉన్నాయి. గ్లాస్ కిటికీలోంచి పైకి చూస్తే, భయపడుతూ రోడ్‌మీద నడచే కన్నెపిల్లలాగ వెలుతురు అప్పుడే వస్తూంది. శివరామన్‌ని ఎందుకు లైక్ చేస్తానో బాగా తెలియదు. ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువంకీ మధ్య ఏదో ఆకర్షణ ? నాలో ఉన్న ఏవో గుణాలు అతనిలో లేకపోవడంవల్ల నాలో సుపీరియారిటీ కాంప్లెక్స్ ఏర్పడి అతన్ని ఎప్పుడూ రక్షిద్దామన్న ఆత్రుత నాలో ఉందా ? నే నిక్కడకు వచ్చిన తరువాత శివరామన్ ఫైల్లో ఉన్న బ్లాక్ మార్క్స్ చాలా మట్టుకు స్వయంగా చెరిపేశాను. శివరామన్‌కి కళ్లకి కనిపించేదే ప్రపంచం. కాళ్ళు ఏ బాటమీద నడుస్తుంటే అదే దోవ. వేరే రాస్తాలున్నట్లు తెలియదు అతనికి. వేరే గమ్యస్థానాలు అతనికి కనిపించవు. దోవ కనిపించకపోతే అలాగే నిలబడిపోతాడు అమాయకంగా.

లౌడ్‌స్పీకర్‌లో కరకర వినిపించింది. గౌహతి వెళ్లే ప్రయాణికుల్ని ప్లేన్ దగ్గరకు వెళ్లమని ఎనౌన్స్‌మెంట్ వచ్చింది. ఆలివ్‌గ్రీన్ గుంపూ, నలుగురు సివిలియన్సూ కిటికీ పక్కనుంచి వేగంగా నడుస్తూ వెళ్లిపోయారు ప్లేన్ దగ్గరికి.

శివరామన్‌తో ఆఖరి మాటలు ఎలా ఉండాలో ఆలోచిస్తున్నాను. కృతజ్ఞుడిగా, కుక్కపిల్లలాగ నావెంట తిరిగే శివరామన్‌కి నా హృదయంలోని ఏదో ఒక మూలని బయట పెట్టాలి.

మేఘాల్లో దాగుడుమూత లాడుతూ పెద్ద ప్లేన్ ఒకటి కోపంగా ఉన్న కందిరీగలాగ తిరుగుతూంది. ఆశ్చర్యం వేసింది. ఈ ఏర్‌పోర్ట్‌లో అంత పెద్ద విమానాలు దిగడానికి సదుపాయాలు లేవు. పైని ఏర్‌పోర్ట్ ఆఫీషల్స్ కొంతమంది ఖంగారుగా తిరుగుతున్నారు. గౌహతి వెళ్లే ఫాకర్ బుద్ధిగా నియమ ప్రకారం లేచి ఉత్తరంవేపు పలకా, పుస్తకం పట్టుకుని రోడ్డు పక్కగా స్కూల్‌కి వెళ్లే రామా ది గుడ్ బాయ్ లాగ వెళ్లిపోయింది..

పైకి వచ్చేము. ఫైర్ ఎంజిన్లు రెండు గడగడ లాడుతూ వచ్చి నిలబడ్డాయి. లేండింగ్ సిగ్నల్ యిచ్చేరని వెనకని ఎవరో అన్నారు. ఆకాశంమీంచి, దక్షిణం నుంచి తిక్క తిరగని గుఱ్ఱంలా రెక్క విరిగిన పక్షిలాగ గెంతుకుంటూ, తన్నుకుంటూ రెండు ఎందల మైళ్ల వేగంతో ఎలా దిగి ఎలా టార్మాక్ చివరదాకా వెళ్లి, ఇంకా ముందుకుపోయి ధ్వంసం అయిపోకుండా ఆగిందో .... ఒళ్లు జలదరించింది. కాక్‌పిట్ పక్కనుంచి మంటలు వస్తున్నాయి. ఫైర్ ఇంజన్లు పరుగెత్తేయి బాణాల్లాగ.

వెనక తలుపు తెరుచుకుని, ముగ్గురు బ్లూ అండ్ వైట్ యూనిఫార్మ్స్‌లో రేంప్ లేకుండానే పైకి గెంతేరు. దూరాన నిలబడ్డ మాలో కొందరు అక్కడికి వెళ్లడానికి ప్రయత్నించేరు. సెక్యూరిటీ పోలీస్ అడ్డేరు. గ్రౌండ్ ఎంజినీర్ స్టాఫ్ కొంతమంది జీప్‌లో అక్కడికి చేరారు.

మంట లారిపోయాయి.

క్రూ ముగ్గురూ మెల్లగా నడుచుకుంటూ దగ్గరికి వచ్చేరు. ముందు నడుస్తున్న పైలట్ నడక ఎక్కడో ఇంతకుముందు చూసినట్లు అనిపించింది. పీక్ కేప్ నుదురుని బాగా కప్పింది. పొడుగ్గా, లావుగా, మార్షల్ బేరింగ్‌తో ఏమీ అవనట్లుగా, ఖాతర్ లేనట్లూ నడక. గేట్ దగ్గరకువచ్చి పీక్‌కేప్ తలమీంచి తీసి జుత్తు సద్దుకుంటుంటే .....

శేషా ....

శేషాచలపతి !

'శేషియో !' అంటూ ఒక్కసారి పరుగెత్తేను.

రెండు చేతులూ వీపు వెనక్కి విసిరి కౌగిలించుకున్నాను.

'శేషియో !'

''మైటీ క్రైస్ట్ ! భాస్కరం !'

''శేషూ !''

నీట్లో పడి మునుగుతూ చచ్చిపోయేవాడికి తన జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలన్నీ ఒక్క క్షణంలో ఫిల్మ్ రీల్ లాగ తిరుగుతాయిట. నాకూ శేషాచలపతికీ సంబంధించిన జీవితంలోని ఘట్టాలు—అన్నీ కాకపోయినా—కొన్ని పేర్లూ, కొన్ని స్థలాలూ మనస్సులో స్పార్క్స్‌లాగ మెరుస్తూ మాయమయేయి.

మిగతా యిద్దరితో ఏదో టెక్నికల్ జార్గన్‌లో చెప్పేడు. వాళ్లిద్దరూ హేంగార్ వేపు నడిచేరు. రెస్తరంట్‌కి తీసుకువెళ్లేను. శివరామన్ వెనకనే వచ్చేడు.

ఎదురుగా శేషూ కూర్చున్నాడు. పక్కని శివరామన్. కూర్చోగానే పరిచయం చేశాను. కుర్చీలోంచి లేచి, నిలబడి చెయ్యి జాపి భుజాల దగ్గర నుంచే హేండ్‌షేక్ యిస్తూ 'హౌడూడూ' అన్నాడు శేషూ.

ఉద్రేకాన్ని అణుచుకోవడం, భావాల్ని కప్పిపుచ్చి మాట్లాడడం ఉద్యోగం కొంత అలవాటు చేసింది. కాని, శేషూని యీ ఎడ్వెంచర్ తరువాత యిక్కడ, ఈవిధంగా కలుసుకోవడం నన్ను కదిలించివేసింది. కాళ్లల్లో శక్తి లేనట్లుగా, నిలకడ పోయినట్లుగా అనిపించింది. మోచేతులు టేబుల్‌మీద ఆన్చి అదే పనిగా శేషూ ముఖంలోకి చూడడం మొదలుపెట్టేను.

శేషూ ముఖం రాతితో చెక్కినట్లుంది. మెరిసే బాకుల్లాంటి కళ్లు. రెండు బాకులు.

''బేరక్‌పూర్‌లో చెక్ చెయ్యలేదు, బాస్టర్డ్స్. నారాయణ్‌గంజ్ వచ్చేటప్పటికి అనుమానం వచ్చింది. సిల్చర్ నుంచి ఏమీ చెయ్యలేనని జవాబు. గౌహతి బ్లేంక్. ఇక్కడ నుంచి మాత్రం ఒ. కె. సిగ్నల్ వచ్చింది. రాకపోతే కర్నల్ భట్టాచార్జీ లాగ పాకిస్తాన్ జైలులో పడిఉందును. అసలు ఎక్కడో క్రేష్ అవును. అనాథరైజ్ ఫ్లయిట్ కాదనుకో. ఫుడ్ డ్రాపింగ్ మిషన్. పెళ్లి చేసుకున్నావేంటి కొంపతీసి. శాంత విశాఖపట్నంలో ఉందిట. ఏదో కాలేజ్. నువ్విక్కడేం చేస్తున్నావు. ఏదో పని. పురుగులుకి ఏమిటి పని ? దొలవడం, గొలకడం, కుట్టడం.''

శివరామన్ వేపు తిరిగి ''ఏఁవంటీ క్లిఫ్ట్ లాగున్నావు. ఎంతమంది ఆడపిల్లల్ని పట్టేవు ? నైఫ్ వాడడం తెలుసా ?'' అన్నాడు శివరామన్ గుండెమీద అరచెయ్యి పరచి ''నీది ఫిజన్ చెస్ట్. పెల్మనిజమ్ ప్రాక్టీస్ చెయ్యి.''

శివరామన్ ముఖంలో 'అయోమయం.'

''నైథనీ .... నేవిగేటర్. చూశావు కదూ యిప్పుడే. యూస్‌లెస్ బగర్. తేజ్‌పూర్ వెళ్లిన తరువాత గుండు గీయిస్తాను వాడికి. లేండ్ అవుతుంటే ట్రౌజర్ తడిసిపోయింది. స్కలక్‌కి. కిందటిసారి మనం కలుసుకున్నప్పుడు ఏం చేస్తూ ఉండేవాడిని ? బర్మాషెల్ ? రిషివాలీ స్కూల్ ? ఎక్కడ ? జ్ఞాపకం రావడంలేదు.''

''కటక్‌డాక్ బంగాళాలో. నువ్వు బర్మాషెల్‌లో.''

''డిస్మిస్ చేశారు. రోగ్స్. ఫకీరులాగ కలకత్తాలో మూడు నెలలు తిరిగేను.

గౌహతి నుంచి ఫాకర్ దిగింది. శివరామన్ అందులో పోవాలి. ఎనౌన్స్‌మెంట్ వచ్చింది.

శివరామన్ లేచేడు.

''జాగ్రత్తగా ఉండు. నేను రాసి యిచ్చిన సూచనలన్నీ అనుసరించు.'' అన్నాను. శేషూ లేకపోతే శివరామన్‌తో ఆఖరి క్షణాలు ఎంత సెంటిమెంటల్‌గా ఉండేవో. శివరామన్ బాగా హర్ట్ అయి ఉంటాడు. ఇంత పొడిగా అన్న మాటలతో. ప్లేన్ దాకా కూడా వెళ్లలేదు. రెస్టరంట్ తలుపు దగ్గరే హేండ్‌షేక్ చేసి పంపించేశాను.

''ట్రెమెండస్‌గా ఆకలివేస్తూంది. లేత లేతగా ఉన్న ఆడపిల్లల్ని తినాలని ఉంది. దొరకరు గాబోలు.''

''దొరకరు.''

''బేరర్‌ని పిలిచి ఆమ్‌లేట్స్, ఫిష్ ఛాప్స్ తెమ్మన్నాను.

''బనారస్ జ్ఞాపకం ఉందా ?''

బనారస్ !

జ్ఞాపకాల భారాన్ని ఏడా దేడాదికీ పెరిగే నా సామాన్లతో కూడా నాతోనే తీసుక వస్తున్నాను. నా సామాన్లని నేను మొయ్యను. జ్ఞాపకాల్ని కూడా ఆబ్జెక్టివ్‌గా చూడడం నా స్వంత శిక్షణలో ఒక భాగం. నాకు సంబంధించిన సంఘటనలు ఎవరికో అయినట్లు అనుకోవడం నా మెంటల్ మేకప్‌లో యిమిడిపోయింది.. నిజమేనా ?

''మొగల్‌సరాయ్ వెయిటింగ్ రూమ్ జ్ఞాపకం ఉందా?'' అన్నాడు...... తెల్లవారుజామున మొగల్‌సరాయ్ స్టేషన్. దూరంగా, భారంగా, గుడ్స్ వేగన్ల షంటింగ్ .... అవతల ప్లాట్‌ఫార్మ్‌లో నగ్నంగా వెలిగే ఎలక్ట్రిక్ బల్బ్ కాంతిలో స్టిల్ లైఫ్ చిత్రంలో మనుషుల్లాగ టీ స్టాల్ దగ్గర తలలు బాగా వంచి టీ తాగుతున్న వ్యక్తులు ..... యాజీ చైర్స్ ఏవీ ఖాళీ లేకపోతే రెండు కుర్చీలు కలిపి, సరిపోక, ఐదడుగుల పద కొండున్నర అంగుళాల దేహాన్ని పాములాగ మెలికలు తిప్పుతూ నిద్రపట్టని ఎర్రటి కళ్లు అప్పుడప్పుడు విప్పి మూడు భాషల్లో రైల్వేస్‌ని బూతులు తిడుతూ బాధపడుతూన్న శేషు .... తుఫాన్‌లో దిగిన శాంతకి సర్ గలాహడ్‌లాగ నడుం దాకా దేహం వంచి 'బౌ' చేసి, శాంత నావేపు చూసి పకపక నవ్వుతుంటే, చెయ్యి పట్టుకుని అవతల ప్లాట్‌ఫార్మ్‌కి తీసుక వెళ్లడం ....

ఆ తీసుకువెళ్లడం, అలాగే శాంతని నా జీవితంలోంచి కూడా తీసుకు పోయాడు శేషూ. ఈ ఉద్యోగ భారం ఎటువంటి స్మృతులైనా మనస్సు అడుక్కి తోసి నొక్కి ఉంచుతుంది.

''జ్ఞాపకం ఉంది. నువ్వేదో నా రొమాంటిక్ రహస్యాల్ని ఛేదిద్దామని నా వెంటనే నీడలాగ నాకు తెలియకుండా కాశీ నుంచి మొగల్‌సరాయ్‌దాకా వచ్చి, తరువాత విసుగుపుట్టి, నన్ను కలిసి ...... ''

''శాంత యిప్పుడొక గ్లోరిఫైడ్ స్పిన్‌స్టర్. లక్కీ బ్లోక్‌ని నువ్వు. శాంత ఒక జబ్బు. దాన్నుంచి నిన్ను విడుదల చేశాను. ఆ జబ్బుని నేను త్వరలోనే వదలగొట్టించుకున్నాను.''

కలకత్తా వెళ్లే ఫాకర్ ఎగిరిపోతోంది. శివరామన్ బాగా నొచ్చుకొని ఉంటాడు.

''ఏం చేస్తున్నా విక్కడ ?''

సాధారణంగా చాలాకాలం తరువాత అకస్మాత్తుగా కలిస్తే ఒకర్నొకరు అడిగే మొట్టమొదటి ప్రశ్న యిది. అడుగుతా డనుకున్న ప్రశ్నలు అడక్కపోవడం శేషూ ప్రత్యేకత.

చెప్పేను.

నవ్వేడు. నవ్వితే దానిమ్మపండు గింజలు. తెల్లగా అమాయకత్వం.

''నీకు సరిపోయిందిలే. కాన్ఫరెన్సెస్, మీటింగ్స్, మినిట్స్, రోల్‌టాప్ డస్క్, ఎడ్మినిస్ట్రేటివ్ జీనియస్.... గవర్నింగ్.... అడుగుమీద అడుగు వేసుకుంటూ గవర్నమెంట్ రథాన్ని తొయ్యడం.''

బేరర్ ప్లేట్లు తెచ్చిపెట్టేడు.

చకచక తినడం మొదలుపెట్టేడు.

నైథానీ, రెండో అతనూ మాట్లాడుకుంటూ శేషూ ప్లేన్ దగ్గరికి వెళ్తున్నారు. ...... కటక్ డాక్ బంగళాలో అనుకోకుండా కలిశాం యిలాగే. పక్క గదిలోనే దిగేడు కలకత్తానుంచి పూరీ బిజినెస్‌మీద వెళ్తూ. వరాండాలో చీకటి పడుతూంటే పైని నగర దీపాలు మెల్లమెల్లగా వెలుగుతుంటే, కలుసుకున్న రెండు నిముషాల తరువాతే 'ఆల్బర్ట్ కామూ చదివేవా' అని అడిగి, ఆత్మహత్య గురించి కామూ, షోపెన్ హవర్ అభిప్రాయాలు నాతో కోపంగా చెప్పి ..... బిజినెస్‌లోని సోల్‌ని పరీక్షిస్తున్నానని అన్నాడు. తరువాత, ''బనారస్‌లో అమరానందతో కలిసి హఠయోగం చేసేవాడిని తెలుసా. గట్టర్ స్నైప్ .... ఉన్న తల చెడిపోయింది. వాడు ఎక్స్‌పర్ట్. కాని, వాడి ముఖం కుక్కలు పీకిన ఎముకలాగుండేది. రోత పుట్టుకొచ్చి మానేశాను. కాని, వాడి ప్రభావం యింకా పోలేదు. సాయంకాలం నా నోట్లో వేదాంతం పువ్వుపూస్తుంది మరచిపో .... ''

తెల్లవారుజామున నేను బాలసోర్ పోవాలి. స్టేషన్‌కి నడిచేం యిద్దరమూ.

''నేను ఏకాకిని. తల్లి లేదు. తండ్రి జైల్లో లైఫ్ టెర్మ్. నామీద దయ ఉంచు. మరిచిపోకు'' అన్నాడు రైలు కదలబోతూ ఉంటే.

నవ్వేను.

''నవ్వకు. నిజం. నా చిన్నప్పుడే ఒక మెత్తని కల.... పచ్చటి కల కరిగిపోయి అంతమయి పోయింది. అప్పటినుంచీ నా జీవితం ఒక పీడ కలగా మారింది.''

రైలు కదలిపోతుంటే, కుడిచేతి ఉంగరంవేలూ, చూపుడువేలూ విప్పి 'వి'—సైన్ చేశాడు పగలబడి నవ్వుతూ ......

ప్లేట్లు పక్కకి నెట్టి అన్నాడు : ఇంకా ఎన్నాళ్లో ఉండడం కష్టం. పని అయిపోగానే గేటు దాటేయడమే. కాని పని ఏమిటో, అది ఎప్పుడు అయిపోతుందో ఎలా తెలుసుకోవడం ?

కొంచెంసేపు ఆగి, ఫోర్క్ తీసి టేబుల్ మీద గుచ్చుతూ

"కడుపు నిండితే యిలాంటి ప్రశ్నలే వస్తాయి. బర్మా షెల్ వదిలి, మూడు నెలలు పార్క్‌బెంచ్ జీవితం కలకత్తాలో గొప్పగా ఉండేది. ఒకటే ప్రశ్న. రేపటి ఖానా ఎలా వస్తుంది? ఆఖరికి పట్నాయక్‌ని ఖూనీ చేస్తానని బెదిరించి పాత రికార్డు అంతా మాపు చేయించి, వాడి సిఫారస్‌తోనే ఈ ప్రైవేట్ ఏర్‌లైన్స్‌లో చేరేను. నా వయస్సు తెలుసు కదూ. ముప్పయి తొమ్మిది. అయితే ఫిజికల్‌గా 'ఏ' క్లాస్ ఫిట్‌నెస్. పాత 'సీ' లైసెన్స్ పనికొచ్చింది. నీ పనిలో వర్రీ ? కిడ్నీ జబ్బులు ? కళ్ళక్రింద నల్లటి చక్రాలు ?

శేషూని చూస్తుంటే, ఏదో టానిక్‌కి ఎడ్వర్‌టైజ్‌మెంట్ లాగ ఉన్నాడు. దేహం అంతటిలోంచీ ఆరోగ్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోమన్ ముక్కూ, గ్రీషియన్ నుదురూ, ఇరానీ కళ్ళు .... తెలుగువాడి తెలివైన వాడి చూపూ .... అవధులులేని అందం.

నైథానీ వచ్చాడు తలుపు తోసుకుని. సెల్యూట్‌చేసి కుర్చీ లాక్కుని కూర్చోబోతూంటే,—

"కూర్చోకు, కూర్చోమనక ముందే. నిలబడే మాట్లాడు ఏం కావాలి ?" అన్నాడు శేషూ.

పాము కుట్టినట్లు కుర్చీ వదిలి, నిటారుగా నిలబడి నైథానీ "ఇంకో గంటలో బాగయిపోతుంది. మేజర్ డామేజ్ ఏమీ అవలేదు." అన్నాడు. ఏదో పుస్తకంలోంచి చదువుతున్నట్లు మాటలు. కోపం అసూయ, అసహాయత్వం.

"సరే వెళ్ళు. తొమ్మిది గంటలకి టేకాఫ్. కేరీ ఆన్."

నైథానీ బొంగరంలాగ వెనక్కి తిరిగి తల వంచుకుని పైకి పోయాడు..... కటక్ డాక్ బంగాళాలో శేషూ అన్న మాటలు కొన్ని జ్ఞాపకం వచ్చాయి. "నువ్వేమేనా అను. అన్నిటికంటె ముఖ్యమైన ఫిలసాఫికల్ ప్రాబ్లమ్ ఆత్మహత్య. కాలం, ఖర్మ, ఏర్పరచిన జీవిత పరిమితుల్ని ఒక్క దుముకుతో దాటేయాలి. తలుచుకున్నప్పుడు చావు—మనకే ఉంది. ఎవరో, ఏ జబ్బో, ఏ క్రిములో చంపేముందే దర్జాగా మనమే మనల్ని చంపుకోవాలి. బాత్‌టబ్‌లో వేడినీళ్ళు నింపి అందులో పడుకుని రిస్ట్ దగ్గర బ్లేడ్‌తో కోసుకుంటే గంటలో తియ్యగా చావు. కాని, నా కలా యిష్టంలేదు. స్కైస్క్రేపర్ పదమూడో అంతస్తుమీదినుంచి పేవ్‌మెంట్ మీదకి ఆర్క్‌లాగ దుమికి రక్తం కక్కుకుని చావాలి ....."

బేరర్ కాఫీ తెచ్చాడు. పాట్ లోంచి లిక్కర్ కప్పుల్లో పోసి పాలూ, చీనీ వేసి కలిపి శేషూవే పొకటి జరిపి వే నొకటి దగ్గరగా లాగి సిప్ చెయ్యడం మొదలుపెట్టేను.

పోస్టర్ ఏర్‌మైల్ వాన్ జోరుగా దూరంనుంచి వస్తూంది.

రెండు గెద్దలు కిందికీ, మీదికీ చక్కర్లు కొట్టుతున్నాయి.

ఏర్‌పోర్ట్ అంతా అలికిడిలేక నిశ్శబ్దంగా ఉంది.

"శేషూ, నీ బ్రేక్ ఫ్లూయిడ్ సంగతి ఏమిటయింది ?"

ఉప్పెనగా నవ్వు. "జ్ఞాపకం ఉందా యింకా ? ఆవిరయిపోయింది అలాగే. నరహరి చెట్టియార్‌కి ముప్పయివేల నష్టం మిగిలించి వచ్చేశాను మెడ్రాస్ నుంచి "

ఎక్సెల్సియర్ కెమికల్స్ అని ఒకటి నరహరి చెట్టియార్ చేత మొదలుపెట్టించి, తనేదో స్పెషల్‌గా తయారు చేసిన హైడ్రాలిక్ బ్రేక్ ఫ్లూయిడ్ అతన్ని కోటీశ్వరుణ్ణి చేస్తుందని నమ్మించి ....

ఆవిరి చేశాడన్నమాట.

ఎక్కడ, ఎలా ఏ పరిస్థితుల్లో ఎవరితో పరిచయం చేసుకుంటాడో అతనికే తెలియాలి. రైళ్ళల్లో రెండు నిముషాల్లో ఇతరులచేత దీర్ఘమైన ఆత్మకథలు చెప్పిస్తాడు. ఆత్మబంధువుల దగ్గర కూడా నిర్భయంగా అబద్ధాల అల్లిక చేస్తాడు.

నైథానీ వస్తున్నాడు. చాలా కృంగిపోయినట్లుగా ఉన్నాడు. శేషూతో ఉన్నవాళ్ళకి భయంకరమైన డిప్రెషన్ వస్తుంది. లేకపోతే మేఘాల్లో హమేషా విహరింపజేస్తాడు. మధ్యరకంగా, సహజంగా, ఉండడు. నైథానీ దురదృష్టవంతుడు.

"శేషూ. మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావో. రూటీన్ జీవితంలో తుఫాన్‌లాగో, టైడల్‌వేవ్ లాగో వస్తావు. నాతో వచ్చి రెండు రోజులుండగలవా" అని అడిగేను.

అర నిముషం ఆలోచించాడు. ఆలోచించాడా ?

"ఉండలేను. ఉండనని తెలుసు నీకు. ఇలాంటి సిల్లీ ప్రశ్న లెప్పుడూ అడగలేదు నువ్వు."

నైథానీ వచ్చేడు లోపలకు. సెల్యూట్‌చేసి, "మీరొచ్చి చెక్ చెయ్యండి. అంతా ఒ. కే. అనుకుంటాను." అన్నాడు.

శేషూ లేచాడు.

బేరర్‌కి డబ్బు యిచ్చేసి బయటకు వచ్చేం.

తొమ్మిది గంట లవుతున్నా ఎండ లేతగా, కొత్తగా ఉంది. ఉత్తరాన్ని మాత్రం దట్టంగా నల్లగా మేఘాలు సుళ్ళు తిరుగుతున్నాయి. శేషూ ఏరోడ్రోమ్ ఆఫీసర్ గదిలోకి వెళ్ళి ఏదో మాట్లాడి, సంతకాలు చేసి తిరిగి వచ్చేడు. ముగ్గురం ప్లేన్ దగ్గరికి వెళ్ళేము.

ఫార్ములాలు అలవాటయిపోయిన నేను ఉండబట్టలేక "సుశీలని చూడలేదు నువ్వు. ఎంతో 'యిద'వు తుంది" అన్నాను.

"ఎవరా బిచ్ ? నీ భార్యా ?" అని నా తలమీద అరచేత్తో గట్టిగా కొట్టి లోపలకు వెళ్ళిపోయాడు. కాక్‌పిట్‌లో కూర్చుని, రెండు ఎంజిన్లూ ఒకదాని తరువాత ఒకటి స్టార్ట్ చేశాడు.

ముందుకు వంగి, విక్టరీ సైన్ చేసి, నవ్వి నాలిక పైకి పెట్టి వెక్కిరించి, మెల్లగా టేకాఫ్ పాయింట్ దగ్గరికి తీసుకుపోయాడు ప్లేన్‌ని. ప్రచండ వేగంతో టార్మాక్‌మీద చివరదాకా పోయి, పైకి లేచిపోయింది. దూకుడుగా పైకి దరిదాపు నిలువుగా లేస్తూ పోయి ఉత్తరాన్ని ఆవరించిన నల్లటి మేఘాల్లోకి దూసుకుంటూ పోయాడు శేషూ.

నీరెండలో మేఘాల నీడ పడడం మొదలుపెట్టింది, దూరాన పైని ఉరుములు.